సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 29 । జూలై । 2024



ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ఉరకలెత్తుతోంది.

వివరాలు 10లో ▸



సండే.. సందడి

ప్రాజెక్టులకు భారీస్థాయిలో వరద నీరు పోటెత్తడంతో పర్యాటకులు తరలివచ్చారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 29.8 /23.7

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ రహదారిపై విజిలెన్స్ తనిఖీలు

జడ్చర్ల: జడ్చర్ల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి–44పై శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ జీటీ యూనిట్–2 అధికారుల ఆధ్వర్యంలో మైనింగ్ శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో రవాణా చేస్తున్న సరుకులు, నిర్ణీత లోడింగ్‌కు మించి ఓవర్ లోడింగ్ చేస్తున్న వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. అలాగే గతంలో ఉన్న జరిమానాలతోపాటు జీఎస్టీ బిల్లులు లేకుండా సరకులు తరలిస్తున్న వాటిని సైతం విచారించి చర్యలు చేపట్టారు. కాలుష్య ధ్రువీకరణ పత్రాలు, బీమా ఇతర పత్రాలు లేని వాహనాలకు సైతం జరిమానా విధించారు. దాదాపు పది వాహనాలను సీజ్ చేశారు. భూత్పూర్, జడ్చర్ల, రాజాపూర్ పరిధిలో జాతీయ రహదారిపై అధికారుల తనిఖీలు కొనసాగాయి. దాదాపు రూ.6 లక్షలపైనే జరిమానా వసూలు చేసినట్లు సమాచారం. మున్ముందు కూడా జాతీయ రహదారిపై తనిఖీలను ముమ్మరం చేస్తామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ ఆనంద్ 'సాక్షి'కి తెలిపారు.

కోయిల్‌సాగర్‌కు నీటి విడుదల



చిన్నచింతకుంట: మండలంలోని ఉంద్యాల గ్రామ పంపుహౌజ్ నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. గత నెల 13న ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పంపులు ఆన్ చేసి నీటిని విడుదల చేయగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కారణంగా 20 రోజులుగా నీటి విడుదల నిలిచిపోయింది. తాజాగా అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేపట్టి పంపులు ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు చైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీటితో నింపి రైతులకు సాగునీరు అందేలా కృషి చేస్తామన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ హెల్త్ కమ్యునిటీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్మిక వర్గం సంఘం ఏర్పాటు చేసుకుని అనేక హక్కులను సాధించుకున్నట్లు తెలిపారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి కురుమూర్తి బీజేపీ సర్కారు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈనెల 30న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామ న్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, యూనియన్ జిల్లా కార్యదర్శి సాధన, భాగ్య, మహాలక్ష్మి, చంద్రకాంత్, రాజ్‌కుమార్, గాలన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

నల్లమల బిడ్డను.. ఎప్పటికీ రుణపడి ఉంటా

కల్వకుర్తిలో జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సభావేదికపై నుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- సీఎం స్థాయిలో ఉన్నా మీకు సోదరుడినే..
- ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా
- గ్రామాల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలి
- దివంగత నేత జైపాల్‌రెడ్డి మార్గం ఆదర్శనీయం
- రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన మహనీయుడు

సాక్షి, నాగర్‌కర్నూల్/ కల్వకుర్తి/ కల్వకుర్తి టౌన్/ కల్వకుర్తి రూరల్ : 'నేను ముఖ్యమంత్రిగా ఎదిగినా.. మీ నల్లమల బిడ్డను.. జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, సీఎం స్థాయిలో ఉన్నా మీకు సోదరుడినే. ఢిల్లీకి రాజునైనా తల్లికి కొడుకునే.. నా ఎదుగుదలకు కారణమైన నల్లమల ప్రాంతాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటా.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా.. కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పట్టణ శివారులోని కొట్ర చౌరస్తాలో ఏర్పాటు చేసిన జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కల్వకుర్తి పట్టణంలో పర్యటన సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి వరాలు ప్రకటించారు.



కల్వకుర్తిలో బహిరంగ సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 1,120 మహిళా సంఘాలకు రూ.108.66 కోట్ల నిధులను డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాల కింద మంజూరు చేశారు. అందుకు సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, ఏఐసీసీ నాయకుడు వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు చైతన్య, లక్ష్మి, గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ పాల్గొన్నారు.

మాట ఇస్తే చేసి తీరుతాం..

కాంగ్రెస్ పార్టీ ఏదైనా మాట ఇస్తే అది తప్పకుండా చేసి తీరుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన కేంద్ర మాజీ మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి అధికారంలో ఉన్నా.. లేకున్నా.. చివరి శ్వాస వరకు ప్రజా జీవితంలోనే గడిపారన్నారు. నమ్మిన సిద్ధాంతాల ప్రకారం ఆయన రాజకీయాలు చేశారని, పదవులకే గౌరవం తెచ్చేలా రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన మహనీయ వ్యక్తి అన్నారు. జైపాల్‌రెడ్డి సూచన మేరకే తెలంగాణ ఏర్పాటైనప్పటికీ ఆయన ఆశించిన ఫలితాలు రాలేదని విమర్శించారు. కల్వకుర్తి ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని చేజారిందని జైపాల్‌రెడ్డి బాధపడ్డారన్నారు. నాయకులను గెలిపించిన కార్యకర్తలను ప్రజాప్రతినిధులుగా చేసే అవకాశం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో రాబోతుందని, నాతో సహా ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలను ప్రజాప్రతినిధులుగా గెలిపించి, గ్రామాల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.



కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ మల్లురవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

కల్వకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భారత్ జోడో యాత్రలో భాగంగా కల్వకుర్తికి వచ్చినప్పుడు ఇదే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చెప్పాను కల్వకుర్తి నియోజకవర్గానికి ఒక్కరు కాదు ఇద్దరు ఎమ్మెల్యేలు అని హామీ ఇచ్చాను. ఒకరు నారాయణరెడ్డి అయితే ఇంకొకరు రేవంత్‌రెడ్డి అని చెప్పా. ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేసి మీ రుణం తీర్చుకుంటానని సీఎం పేర్కొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్


- ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో కళాకారుల బృందం ఆటపాటలు సీఎం సభకు వచ్చిన వారిని ఆకట్టుకుంది.
- 4.51 గంటలకు సభాస్థలి మీదుగా హెలీకాప్టర్ చక్కర్లు కొట్టి వెళ్లిపోయింది.
- 4.56 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్ దిగగా.. మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి స్వాగతం పలికారు.
- 5.05 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యకర్తలకు అభివాదం చేస్తూ స్టేజీపైకి వచ్చారు.
- 5.10 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి.. జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.
- 5.55 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించి.. 6.25 గంటలకు ముగించారు.
- 6.27 గంటలకు మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ
- 6.35 గంటలకు కొట్రగేట్ వద్ద కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణకు వెళ్లారు.
- 6.45 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- 6.49 గంటలకు రోడ్డు మార్గంలో రంగారెడ్డి జిల్లా కందుకూరు పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు వెళ్లిపోయారు.

సీఎంకు దార్శనికత ఉంది : దామోదర రాజనర్సింహ



ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉండటం, అందులో కల్వకుర్తి ప్రాంతానికి రావడమే గాక.. జైపాల్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జైపాల్‌రెడ్డితో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, 1971 నుంచే ఆయనను దగ్గరగా ఉన్నానని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజాస్వామ్య ప్రభుత్వమని, బీఆర్ఎస్ లాగా అప్రజాస్వామిక పాలన అందించదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి దార్శనికత ఉందని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని చెప్పారు.

జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం : జూపల్లి కృష్ణారావు



పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంలో అప్పటి స్పీకర్ మీరాకుమారితో మాట్లాడి బిల్లును పాస్ చేయించడంలో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం అని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 1980లోనే ముందుచూపుతో కల్వకుర్తి ప్రాంతానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ)ని రూపకల్పన చేశారన్నారు. పట్టుదలకు మారుపేరుగా ఉన్న జైపాల్‌రెడ్డి అంగవైకల్యం ఉన్నా 72 కాలేజీలకు అధ్యక్షుడిగా పనిచేశారంటే అతని స్ఫూర్తిని ఇప్పటి వారు కొనసాగించాలన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే హైదరాబాద్ మెట్రో రైలుకు ప్రతిపాదనలు తయారు చేశారని గుర్తుచేశారు. సీఎంగా రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి పాలన చేయడం పాలమూరు ప్రజల అదృష్టమని, ఇక్కడి ప్రాంతానికి ముఖ్యమంత్రి దశ- దిశగా నిలుస్తారన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



పుష్పాలంకరణలో తోట మైసమ్మ అమ్మవారు



కురిహినిశెట్టి కాలనీలో బోనాలతో తోట మైసమ్మ ఆలయానికి వస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కురిహినిశెట్టికాలనీ తోట మైసమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకారం, మహానివేదన, మంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు జోషి సంతోషాచార్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదం వితరణ చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఆలయం వద్దకు తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. అలాగే ఏనుగొండ బైపాస్ సమీపంలోని బ్రైట్ సిటీ కాలనీలో బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు పులిజాల రవికిరణ్, ఉపాధ్యక్షుడు చెన్నయ్యయాదవ్, సభ్యులు ప్రభాకర్, యాదయ్య, శంకరయ్య, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికులపై సమాజంలో ప్రత్యేక గౌరవం



యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల ఆత్మశాంతి కోసం మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మాజీ సైనికుల సంఘం నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సైన్యంలో ఉండి దేశానికి మాజీ సైనికులు చేసిన సేవలు దేశం మరువలేనివని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిల్వర్ జూబ్లీ కార్గిల్ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. దేశం కోసం వారు చేసిన సేవలు చాలా అమోఘమని, ఎందరో వీరులు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. కార్గిల్ యుద్ధం మన కళ్ల ముందు జరిగిందని, ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లో మన జవాన్లు పోరాడారని కొనియాడారు. సైన్యంలో పనిచేసిన వారి పట్ల సమాజం ప్రత్యేక గౌరవం కనబరుస్తుందన్నారు. భవిష్యత్‌లో పదవీ విరణ పొందిన ఆర్మీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కోసం ప్రభుత్వం తరఫున సమస్యలకు పరిష్కారం చేయిస్తానన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధ సమయంలో, వివిధ సందర్భాల్లో దేశంలో కోసం పోరాడిన మాజీ సైనికులను సన్మానించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, అడ్వైజర్ వెంకటయ్యగౌడ్, ఎంఆర్‌కే రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రాం, వెంకట్‌రెడ్డి, కృష్ణ, లక్ష్మారెడ్డి, రఘుపతిరెడ్డి, నరేందర్, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, గణేష్‌బాబు, మురళీధర్‌రెడ్డి, రమేష్, శ్యామూల్, మనోహర్, వెంకట్రామరెడ్డి, శయనన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి భూతం

- ఈ నెల 13న రామయ్యబౌళిలోని ఓ ఇంట్లో ముగ్గురు యువకులు హరిచందర్, రవికాంత్, శివ గంజాయి తాగుతుండగా ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అలాగే వారి నుంచి 305 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 25న ఏనుగొండ సమీపంలోని ఓ ఇంట్లో వేణు, ప్రకాష్ అనే ఇద్దరు యువకులు గంజాయి తాగుతుండగా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని.. వారి నుంచి 260 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నారు.

- పాలమూరులో చాపకింద నీరులా విస్తరిస్తున్న 'గమ్మత్తు'
- చెడు వ్యసనానికి బానిసవుతున్న యువత
- జిల్లాకేంద్రంలో ప్రత్యేకంగా 8 హాట్ స్పాట్స్
- అమ్మేవారు.. తాగేవారు సైతం టీనేజర్స్, యువతే
- అరికట్టేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో గంజాయి వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. చాపకింద నీరులా గంజాయి విస్తరిస్తోంది. యువతే లక్ష్యంగా విక్రయాలు పెరుగుతున్నాయి. అయితే ఎక్సైజ్ శాఖ సైతం తనిఖీలు ముమ్మరం చేసినా పూర్తిస్థాయిలో కట్టడి కావడం లేదు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గతంలో పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ తీరు మార్చుకోకుండా అదే పనిగా గంజాయి వినియోగానికి పాల్పడుతున్న వారి చిట్టా తయారు చేసే పనిలో పడ్డారు. దీనికోసం పోలీస్ శాఖలో ప్రత్యేకంగా రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎస్పీ గంజాయిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు.

- గంజాయి కేసుల కట్టడికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించకపోవడంతో చివరి ప్రయత్నంగా పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా తీవ్రమైన చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా పోలీస్ రికార్డుల్లో పేరు నమోదైతే జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పుడు అధికారులు చేపడుతున్న చర్యలతో అయిన గంజాయి వినియోగదారుల్లో మార్పు వస్తుందా.. లేక పాత పద్ధతిలో వెళ్తారా.. అనేది చూడాలి.

ఆరు కేసులు నమోదు

జిల్లాలో పోలీస్ శాఖతోపాటు ఎక్సైజ్ శాఖలో కలిపి ఆరు కేసులు నమోదు కాగా.. 3.525 కిలోల ఎండు గంజాయి సీజ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో 8 హాట్ స్పాట్ ఏరియాలను గుర్తించారు. వీటిలో ప్రధానంగా ట్యాంక్ బండ్, కొత్త చెరువు రోడ్, మహేశ్వరి థియేటర్ ఎదురుగా, పాలిటెక్నిక్ కళాశాల మైదానం ఉన్నాయి. గంజాయి ఒక్కో పాకెట్‌లో 12 గ్రాములు నింపి ప్యాక్ చేసి రూ.300–400 వరకు విక్రయిస్తున్నారు. దీనిని యువకులు సిగరెట్‌లో ఉండే పొగాకులో గంజాయి కలిపి పీలుస్తున్నారు. దీంతో ఒక రకమైన మత్తుకు వారంతా అలవాటు పడుతున్నారు. ఈ గంజాయి పీలుస్తున్న సమయంలో యువత గ్రూపులుగా ఏర్పడి ప్రత్యేక గదులు, శివారు ప్రాంతాలకు వెళ్లి వాటిని తీసుకుంటున్నారు. కేవలం 16 నుంచి 28 ఏళ్ల మధ్య వారితో పాటు ఆటోలు నడుపుతున్న కొందరు యువకులు దీనిని అధికంగా తీసుకుంటున్నారు.



ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన గంజాయి

రెండు బృందాల ఏర్పాటు

మహబూబ్‌నగర్‌లో గంజాయి వినియోగం, అమ్మకాలను పూర్తిగా నియంత్రించడానికి రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నాం. ప్రతిరోజు సాయంత్రం ట్యాంక్ బండ్, కొత్త చెరువు రోడ్, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నాం. దీంతోపాటు అనుమానం కలిగిన కిరాణ దుకాణాల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నాం. 50 గ్రాములు దొరికిన కేసులు పెట్టడంతోపాటు బైండోవర్ చేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

తనిఖీలు చేస్తున్నాం..

గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు రూ.2 లక్షలకు బైండోవర్ చేస్తున్నాం. ప్రముఖంగా పట్టణంలో గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పూర్తిస్థాయిలో నిర్మూలనకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నాం. ఇకపై గంజాయి విక్రయించినా.. వినియోగించినా కఠిన చర్యలు తప్పవు. గతంలో గంజాయి వినియోగిస్తూ.. రవాణా చేస్తూ పట్టుబడిన పాత నేరస్తులపై హిస్టరీ షీటర్లుగా రికార్డుల్లో పేర్లు నమోదు చేస్తాం. ప్రధానంగా హాట్‌స్పాట్ ఏరియాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం.

– వీరారెడ్డి, ఎక్సైజ్ సీఐ, మహబూబ్‌నగర్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను జేఏసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందన్నారు. ఒకటో తేదీన పెన్షన్లు వేయడం తప్ప మరే సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, ఎంపాయిస్ హెల్త్ స్కీం ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలని, ఈహెచ్ఎస్‌ను యూనివర్సిటీలు, జీహెచ్ఎంసీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు, మార్కెటింగ్ శాఖ పెన్షనర్లకు వర్తింపజేయాలని, ప్రతి జిల్లాలో అన్ని వసతులతో రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన 5 శాతం ఐఆర్ 20 శాతానికి పెంచాలని, పీఆర్‌సీ అమలు చేయాలని, పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, ప్రతి జిల్లాలో పెన్షనర్ల సంక్షేమ భవన్‌ను నిర్మించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో మౌనదీక్షతో నిరసన ప్రదర్శన చేపడుతామన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు తిమ్మప్ప, కొత్వాల్, కొండయ్య, జిల్లా అధ్యక్షుడు రామదాసు, కార్యదర్శి కిష్టయ్య, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ



జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

జూరాలకు కొనసాగుతున్న భారీ వరద

గద్వాల రూరల్/ దోమలపెంట/ రాజోళి/ ఆత్మకూర్: శ్రీశైలానికి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ఉరకలెత్తుతోంది. ఎగువ ప్రాంతం నుంచి ఆదివారం జూరాలకు భారీస్థాయిలో వరద కొనసాగింది. రాత్రి 9 గంటల సమయంలో 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 41 గేట్లు ఎత్తి 2,75,538 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 18,922 కలిపి దిగువనున్న శ్రీశైలానికి వదిలారు. అలాగే నెట్టెంపాడుకు 750, భీమా–1కు 1,300, 2కు 750, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల సమాంతర కాల్వకు 600, కుడి ప్రధాన కాల్వకు 578, ఎడమ ప్రధాన కాల్వకు 820 వదలగా.. మరో 43 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సుంకేసుల నుంచి 28 గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

సుంకేసులకు మరింత వరద

సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం మరింత పెరిగింది. శనివారం లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆదివారం 1.49 లక్షలు వచ్చింది. దీంతో డ్యాం వద్ద 28 గేట్లు తెరిచి 1,46,746 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి, 1,540 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. ఆదివారం 873.4 అడుగుల వద్ద 156.3860 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి కలిపి 4,41,206 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుంది. దీంతో శ్రీశైలం కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 61,111 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,002 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు ద్వారా 5,958 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని కేవలం ఐదు యూనిట్లలోనే చేపడుతున్నారు. జూరాలకు భారీగా వరద వస్తుండటంతో దిగువ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోతున్నామని జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. దీంతో ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.



జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి



జూరాల ప్రాజెక్టు దిగువ భాగం సర్కిల్ వద్ద నిలిచిన వాహనాలు

సండే.. సందడి

గద్వాల అర్బన్/అమరచింత/రాజోళి/కొల్లాపూర్ రూరల్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో ప్రాజెక్టు పరిసరాలన్నీ సందడిగా మారాయి. యువతీ యువకులు కొందరు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ బిజీగా గడిపారు. దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మను చూసి సంబురపడ్డారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల వైపు చేపల వంటకాల రుచి చూశారు. పర్యాటకులతో చేపల వంటశాలలు కిటకిటలాడాయి.

■ ప్రాజెక్టు సందర్శనకు దాదాపు లక్ష మందికి పైగా తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినా వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. అమరచింత పోలీసులు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు. సుమారు 10 వేల వాహనాల్లో పర్యాటకులు వచ్చినట్లు ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. ప్రాజెక్టు దిగువ భాగంలోకి పర్యాటకులను అనుమతించలేదు.

■ సుంకేసుల డ్యాం నిండుకుండలా మారింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో అధికారులు 28 గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో డ్యాం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

■ కొల్లాపూర్ మండలం సోమశిల పుష్కర ఘాట్లకు శ్రీశైలం డ్యాం బ్యాక్ వాటర్ చేరడంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్దఎత్తున తరలివచ్చారు. పుష్కర ఘాట్లన్నీ సందడిగా కనిపించాయి. కొందరు మరబోటులో కృష్ణానదిలో విహరించారు.



సుంకేసుల డ్యాం వద్ద చేపల వేట..



చేపలు కొనుగోలు చేస్తూ..



సెల్ఫీ దిగుతూ..



సోమశిలలో బోటు ద్వారా కృష్ణానదిలో విహరిస్తున్న పర్యాటకులు

క్లుప్తంగా

పురుగు మందుతాగి మహిళ ఆత్మహత్య

నవాబుపేట: మండలంలోని రేవల్లిలో పురుగు మందుతాగి మహిళ ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన చీపుర్ల సువర్ణ (36) కడుపు నొప్పి భరించలేక శనివారం రాత్రి పురుగు మందు తాగింది. అర్ధరాత్రి ఆమె కనిపించకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతుకుతుండగా ఇంటి సమీపంలో అపస్మారక స్థితిలో కనిపించింది. దీంతో వెంటనే ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రాములు (ఫైల్)

దామరగిద్ద: రోడ్డు ప్రమాదంలో గ్రామపంచాయతీ కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని ఆశన్‌పల్లికి చెందిన రాములు (53) గ్రామపంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. తెలిసిన వారు మృతిచెందడంతో ఆదివారం ఉదయం అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ద్విచక్రవాహనంపై లోకుర్తికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాములుకు భార్య మాణిక్యమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

మక్తల్‌లో మరొకరు..

మక్తల్: పట్టణ సమీపంలోని దండు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నర్వ మండలం పాతర్చేడ్‌కు చెందిన రమేశ్ (47) పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట లేమన్ సోడా విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం స్వగ్రామమైన పాతర్చేడ్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. రమేశ్‌కు భార్య జములమ్మ, కుమార్తెలు శ్రీలత, శ్రుతి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బైకరి చెన్నయ్య(46) ఆదివారం జిల్లాకేంద్రంలోని బోయపల్లి గేట్– మోతీనగర్ మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లికి చెందిన సురేష్ శనివారం దేవాలయంలో బాలికను వివాహం చేసుకున్నాడు. బాలిక తండ్రి ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.



కల్వకుర్తిలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, వేదికపై మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, ఏఐసీసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి

కల్వకుర్తికి వరాల జల్లు

- నియోజకవర్గ అభివృద్ధికి రూ.309 కోట్లు
- వైద్య, విద్య రంగాలకు ప్రాధాన్యం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

కల్వకుర్తి/ కల్వకుర్తి టౌన్: ముఖ్యమంత్రి హోదాలో ఆదివారం తొలిసారి సొంత గడ్డకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తిపై వరాల జల్లు కురిపించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.309 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. కల్వకుర్తి పట్టణంలోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకలకు పెంచేందుకు రూ.22 కోట్లు వెచ్చిస్తామన్నారు. అలాగే ఆమనగల్‌లో స్కిల్ డెవలప్ సెంటర్ ఏర్పాటుకు రూ.10 కోట్లు, నియోజకవర్గంలోని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లే రోడ్లకు రూ.163 కోట్లు, కల్వకుర్తిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం కోసం రూ.5 కోట్లు, తండాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లేందుకు పంచాయతీ రోడ్లకు రూ.78 కోట్లు, పలు ప్రాంతాల్లో 5 హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తానన్నారు. మాడ్గుల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.8.3 కోట్లు, మాడ్గులలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులకు రూ.7.5 కోట్లు, వెల్దండలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయిస్తానన్నారు. అలాగే రేవంత్‌రెడ్డి చదువుకున్న తాండ్ర పాఠశాల అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పాఠశాల భవనం పూర్తిగా శిధిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు, ఎమ్మెల్యే వినతి మేరకు పాఠశాలను చక్కగా అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ప్రత్యేక నిధులు : మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్



నల్లమలకు చెందిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటం మన అదృష్టమని, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. జిల్లాలో ఎన్నికల ముందు నిర్వహించిన సభలో ఉమ్మడి జిల్లాలోని 14కు 14 మంది ఎమ్మెల్యేలు గెలిపించాలని కోరిన విధంగానే ఇక్కడి ప్రజలు గెలిపించారని గుర్తుచేశారు. మన ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి తప్పకుండా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే కసిరెడ్డితో కలిసి సీఎంకు నాగలిని బహూకరిస్తున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు

టూరిజం హబ్‌గా ప్రకటించాలి : వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట



నల్లమల ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా ప్రకటించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. నీతికి, నిజాయితీకి నిలువుటద్దంలా జైపాల్‌రెడ్డి తన రాజకీయ జీవితాన్ని కొనసాగించారని, పార్లమెంట్‌లో కల్వకుర్తి ప్రాంత వ్యక్తిగా తన వాణి వినిపించారన్నారు. నల్లమల ప్రాంతం తెలంగాణ ఊటీ లాంటిదని, ఆహ్లాదం, ప్రకృతి అందాలతో ఉండే నల్లమల తెలంగాణకే తలమానికంగా నిలుస్తుందని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్యలో ఉండే ఈ ప్రాంతం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విన్నవించారు.

బీడు భూముల్లో సాగునీరు : వంశీచంద్‌రెడ్డి



కల్వకుర్తి ప్రాంతంలో బీడు భూములుగా ఉన్న పొలాల్లో సాగునీరు పారేందుకు ఉపయోగమైన కేఎల్‌ఐ రూపకర్త జైపాల్‌రెడ్డి గొప్ప నాయకుడని సీడబ్ల్యూసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి ప్రాంత ఉనికిని దేశవ్యాప్తంగా చాటి చెప్పిన జైపాల్‌రెడ్డి చూపిన బాటలో నడవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ ప్రాంతం నుంచి దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న జైపాల్‌రెడ్డి తరువాత సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకోవాలన్నారు.

ప్రజా పాలన అందిస్తున్నాం : కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి



కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజాస్వామ్యంతో నడిచే పార్టీ అని, అందుకు తగ్గట్టుగానే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాపాలన అందిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వంలో మన ముఖ్యమంత్రి చాలా నిక్కచ్చిగా పనిచేస్తున్నారని, చాలా సమస్యలను అలవోకగా పరిష్కారం చూపుతున్నారని కొనియాడారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం పలు రకాల అభ్యర్థనలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల నిరసన



ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తి రూరల్: పట్టణంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలంటూ సీఎం సభలో నిరసన చేపట్టారు. సీఎం ప్రసంగం ప్రారంభమయ్యే సమయంలో ఇళ్ల లబ్ధిదారులు ఒక్కసారిగా నిలబడి ఫ్లకార్డులను ప్రదర్శించారు. అప్రమత్తమైన పోలీసులు వారి నుంచి ఫ్లకార్డులను లాగేసుకున్నారు. వారికి ఫ్లకార్డులు ఎలా వచ్చాయని పోలీసులు ఆరా తీస్తున్నారు.

దొంగల చేతివాటం

వెల్దండ: కొట్రగేట్ వద్ద జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో ఉన్న సాయిరెడ్డి అనే వ్యక్తి జేబులో ఉన్న రూ. 50 వేలు, లింగారెడ్డి వద్ద రూ. 10 వేలు, కొట్రతండాకు చెందిన హర్యానాయక్ వద్ద రూ. 10 వేల నగదు చోరీ చేశారు. మరో వ్యక్తి వద్ద రూ. 10 వేల నగదు చోరీ చేసి పారిపోతుండగా.. అక్కడే ఉన్న కొందరు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. వీరితో పాటు మరికొందరి వద్ద సుమారు రూ. లక్ష వరకు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఉండే సీఎం పర్యటనలో దొంగలు చేతివాటం ప్రదర్శించడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు.

కార్యకర్తల ఆందోళన..

కొట్రగేట్ వద్ద జైపాల్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహావిష్కరించి వెళ్లిన తర్వాత వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్‌రెడ్డితో పాటు మరి కొందరు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. విగ్రహావిష్కరణకు స్థానిక నాయకులను ఆహ్వానించకుండా, పార్టీకి సంబంధం లేని వ్యక్తులు ఎలా వస్తారని వారు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ నాయకులు కల్పించుకోవడంతో కార్యకర్తలు శాంతించారు.

ఆలయాల్లో ప్రముఖుల పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను ఆదివారం తెలంగాణ దేవదాయ శాఖ ట్రిబ్యూనల్ చైర్మన్ ఎం.వెంకటేశ్వర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పూజా కార్యక్రమాల గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం లక్ష్మీ నర్సింహస్వామిని రాష్ట్ర మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల రీసర్చ్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఆఫ్ జనరల్ సుశాంత్ గోయల్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారితో అభిషేకాలు, అర్చనలు చేయించారు.



వెంకటేశ్వర్‌రావును స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

ఆలయ గోపురం చోరీ

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట రామతీర్థ లింగేశ్వర ఆలయంపై ఉన్న రాతి గోపురం, పక్కనే ఉన్న నంది విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదివారం స్థానికులు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రామన్‌గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆలయ గోపురం పురాతనమైనందని గ్రామ పెద్దలు పోలీసులకు తెలియజేశారు. మూడు నెలల కిందటే పక్కనే ఉన్న శివాలయంపై ఉన్న చిన్న గోపురం కూడా ఎత్తుకెళ్లారని, పలు ఆలయాల్లో ఇలాంటి చోరీలే జరిగాయని వివరించారు.



రామలింగేశ్వరస్వామి ఆలయంపై కనిపించని గోపురం

ట్రాక్టర్ రొటోవేటర్‌లో పడి రైతు దుర్మరణం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో ట్రాక్టర్ రొటవేటర్‌లో పడి ప్రమాదవశాత్తు గిరిజన రైతు కొడావత్ హతిరాం (60) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తన వ్యవసాయ పొలం దున్నడానికి ట్రాక్టర్ తీసుకెళ్లాడు. ట్రాక్టర్‌కు రొటవేటర్ అమర్చి డ్రైవర్ పొలం దున్నుతుండగా గడ్డిని తీయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. అది తిరడంతో అతని తల, చేతులకు బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి

ఆత్మకూర్: నీళ్లు తాగేందుకు బావిలోకి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ కథనం మేరకు.. స్కూల్‌గుట్ట తండాకు చెందిన లక్ష్మీదాస్‌నాయక్(36) మండలంలోని బాలకిష్టాపూర్ శివారులో చందూనాయక్ వ్యవసాయ పొలంలో కూలి పనికి శనివారం వెళ్లారు. సాయంత్రం దాహం వేయడంతో దగ్గరలోని బావిలో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. ఎంతకూ రాకపోవడంతో గుర్తించిన వ్యవసాయ కూలీలు బావి వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది కనిపించాడు. భార్య జేజమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులకు వెళ్తోంది. విషయం తెలుసుకుని ఆదివారం ఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ గర్భిణి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన గర్భిణి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దని పుష్పలతను 9నెలల క్రితం చిన్న బావి మండలం, పెద్దదగడకు చెందిన ఎల్లస్వామికి ఇచ్చి వివాహం చేశారు. ఆమె ఐదు నెలల గర్భిణి కావడంతో సొంత గ్రామానికి వచ్చింది. శనివారం రాత్రి ఆమెకు కడుపు నొప్పి రావడంతో పెబ్బేరులోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయగా, పరిస్థితి విషమించగా కర్నూల్ తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనారోగ్యం కారణంగా తమ కూతురు మృతి చెందిందని తల్లి మద్దని సావిత్రమ్మ ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాగులో పడి యువకుడు..

దేవరకద్ర: మండల కేంద్రంలోని వంతెన సమీపంలో నిల్వ ఉన్న వాగు నీటిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. డోకూర్ చెందిన రాఘవేందర్ ఆదివారం చేపలు పట్టేందుకు దేవరకద్ర సమీపంలోని వంతెన ఉద్ద ఉన్న వాగులో దిగాడు. నీటిలో ఉండగానే మూర్చ రావడంతో మునిగిపోయాడు. అక్కడే ఉన్న కొందరు యువకులు నీటిలో పడ్డ రాఘవేందర్‌ను బయటకు తీసిన అప్పటికే మృతి చెందాడు. వెంటనే మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.